ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 28 డిసెంబరు 2024





2023 ముట్యేషన్ ఆమోదించినట్టు, ఒకే పేరుతో ఒక ఖాతాలో పలు సర్వే నంబర్లతో భూ హక్కులు మార్చేసిన చిత్రం



భూ మాయ.. ఒకటి రెండు కాదు.. రూ.కోట్లు విలువైన 223.37 ఎకరాలను రాసేశారు. అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూమి హక్కుదారులు ఐదుగురే. ఐదుగురి పేర్లపైకి మార్చేసిన ఈ భూమి మొత్తం పొన్నూరు అర్బన్ పరిధిలోది కావడం భూ యజమానులను కలవరపరుస్తోన్నది. 60 నుంచి 70కిపైగా సర్వే నంబర్లలోని అర సెంటు నుంచి ఎకరాలకు ఎకరాలు భూమిని కేవలం ఐదుగురు పేరుపై మార్చేశారు. వారి పేర్లు కూడా గందరగోళమే. అసలు వారెవ్వరు.. వారున్నారా అంటే అనుమానమే. కొందరు భూ యజమానుల పరిశీలనలో వెలుగుచూసిన ఈ భూమాయ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా మ్యుటేషన్లు జరగడం చూస్తే ఇందులో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు ఖాతాలను ఎప్పుడు మ్యుటేషన్ చేశారనేది చూపకున్నా, మిగిలిన మూడు ఖాతాలను 2023, 2024 సంవత్సరాల్లోనే మ్యుటేషన్ చేశారు. దీనిని బట్టి ఏదైనా భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారా అనే అనుమానాలు వస్తున్నాయి.

ఐదుగురికి.. రూ. 1000 కోట్ల భూములు

- 70కిపైగా సర్వే నంబర్లు.. 223 ఎకరాలు
- పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ
- 2023, 2024లో మూడు ఖాతాల మ్యుటేషన్
- గత వైసీపీ హయాంలో భారీ భూ కుంభకోణం
- పేరు మార్చి అమ్మేశారా.. తాకట్టు పెట్టి కోట్లు దోచేశారా?

తెనాలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు... రెండు కాదు... అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూములవి. మొత్తం 223.37 ఎకరాలను భూములకు ఐదుగురిని హక్కుదారులను చేసేశారు. పేరు మారిన భూములు క్రయవిక్రయాల ద్వారా చేతులు మారాయా? లేక మరేదైనా కుంభకోణానికి ఉపయోగించుకున్నారా! అనేది అంతుబట్టని విషయం. వైసీపీ నేతల్లో ఎవరైనా పావులు కదిపి తమకు తెలిసిన వ్యక్తుల పేర్లపై భూములను మార్పిడి చేయించి, వాటిని అమ్మేశారా? లేక తాకట్టుపెట్టి రూ.కోట్లు దోచేశారా! అనే సందేహాలకూ సమాధానం దొరకని పరిస్థితి. ఇంతటి భారీ భూ మాయపై అధికారులే గుట్టు విప్పాల్సి ఉంది. రెవెన్యూ ఖాతా ఒకటే దానిలో ఉన్న సర్వే నంబర్లు మాత్రం 70కిపైనే. భూములు కూడా ఒక్కొక్క రి పేరుపై 50 ఎకరాలకుపైనే కట్టబెట్టారు. ఇది ఏ పల్లెటూరులోనో, మారుమూల గ్రామాలకు సంబంధించినదైతే పర్వాలేదు. పొన్నూరు పట్టణ పరిధిలోని భూములు కావడం, వాటి విలువ లెక్కిస్తేనే కళ్లు తిరిగే పరిస్థితి. ఒకరి పేరుపై 60 ఎకరాలుంటే, దానిలో ఎకరాకు మంచిన భూమి 10 నుంచి 20 ఎకరాల వరకే ఉంది. మిగిలిన సర్వే నంబర్లలోనివన్నీ సెంట్లు, గజాల లెక్కనే ఉన్నాయి. అంటే పట్టణంలో సెంటు భూమి కనీసం రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. అంటే పది సెంట్ల భూమి ఉందంటే అతను కోటీశ్వరుడి కింద లెక్కే. ఇంతటి విలువైన భూములు కేవలం ఐదుగురు వ్యక్తుల పేర్లపై మార్చడం ఆందోళన కలిగిస్తున్న అంశం. 5001 నుంచి 5005 వరకు ఖాతా నంబర్లను పూర్తిగా ఐదుగురు వ్యక్తులకు కేటాయించారు. ఒకవేళ ఆ ఖాతాలో ఏదో ఒక సర్వే నంబర్‌కు సంబంధించిన హక్కుదారుడి పేరు ఉంటుందనుకున్నా, ఒకరిపేరుపైనే అంత భూమిని ఎక్కించకూడదు. కానీ ఇక్కడ ఎకరాలకు ఎకరాలు అప్పనంగా మార్చేశారు. పట్టణంలో పది సెంట్ల భూమి రూ.2 కోట్లకుపైగా ఉంటే, పట్టణ శివార్లలో ఉన్న పొలం కూడా ఎకరా రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రకారం లెక్కించినా 223 ఎకరాల భూమి విలువ రూ.వెయ్యికోట్లపైనే ఉంటుందనేది ఒక అంచనా.

భూ కుంభకోణమనేందుకు అనుమానాలు..

- వరుస ఖాతా నంబర్లలో వందల ఎకరాల భూమి పేర్లు మారిపోవడం చూస్తే పొరపాటు కాదనేది అర్థమవుతున్నది.
- ఐదుగురు వ్యక్తులను ఎంపిక చేసుకుని వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలుకానీ, ఇతర నేతలెవరయినా భారీగా రుణ కుంభకోణానికి పాల్పడి

(మిగతా 8వ పేజీలో..)

వారెవరు.. అదెలా సాధ్యం ?

- పొన్నూరు అర్బన్ పరిధిలో 5001, 5002, 5003, 5004, 5005 ఖాతా నంబర్ల కింద ఐదుగురు పేర్లు ప్రస్తావించారు.
- 5001 ఖాతా నంబరులో పట్టాదారుడి పేరుగా అమరావతి లోకనందం అని తండ్రి లేదా భర్త పేరు అమరావతి అని ఉంది. ఇక్కడ ఆ వ్యక్తి ఇంటి పేరు తండ్రి లేదా భర్త పేరు ఒకటిగానే చూపారు. ఈ ఖాతాలో ఆ పేరున 72 సర్వే నంబర్లు చూపి, 45.7641 ఎకరాల భూమికి హక్కుదారుడిగా చూపారు. వీటి మ్యుటేషన్ 2023 ఆగస్టు 5న ఆమోదించినట్లు చూపారు. 326 సర్వే నంబరులో 5.59 ఎకరాలు, 250-6 సర్వే నంబరులో 2.89 ఎకరాలు చూపారు.
- 5002లో పట్టాదారుగా వెలగపూడి నారాయణగౌడ్ అని ఉంది. ఖాతాలో 76 సర్వే నంబర్లు కేటాయించి 61.1325 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. 221-1బీలో మెట్ట భూమి 25 ఎకరాలున్నట్లుచూపారు.
- 5003 ఖాతాలో నిడుబ్రోలు సితార, భర్త నిడుబ్రోలు పేరుతో 77 సర్వే నంబర్లు నమోదై ఉన్నాయి. 42.285 ఎకరాల భూమిపై సితారకు హక్కు చూపారు. 154-5 సర్వే నంబరులోని 12 సెంట్ల భూమికి సంబంధించి మ్యుటేషన్ 2024 మార్చి 12న ఆమోదించినట్లు చూపారు. మిగిలిన నంబర్ల మ్యుటేషన్ ఆమోదించిన కాలమ్‌ను ఖాళీగా వదిలేశారు.
- 5004 ఖాతా నంబరులో గుంటూరు స్నేహారెడ్డి, భర్త గుంటూరు పేరుతో 68 సర్వే నంబర్ల కింద 35.5775 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. ఈ ఖాతాకు సంబంధించి భూమి ఎలా సంక్రమించిందనే కాలం, మ్యుటేషన్ కాలమ్‌లను ఖాళీగా వదిలేశారు.
- 5005 ఖాతా నంబరులో అమరావతి నవనీతం, భర్త అమరావతి పేరుతో 76 సర్వే నంబర్లు కేటాయించారు. వీటిలో మొత్తం 38.6162 ఎకరాల భూమి సంక్రమించినట్లు ఉంది. ఈ ఖాతాకు సంబంధించి అన్ని సర్వే నంబర్లు 2024 అక్టోబరు 19 తేదీతో మ్యుటేషన్ ఆమోదించినట్లు చూపారు.

హక్కుదారులొస్తే మారుస్తారంట

2023లో మ్యుటేషన్ అయినట్లు రికార్డుల్లో చూపిస్తుంది. అయితే అవన్నీ 2016లోనే జరిగినట్లు అధికారులు బుకాయిస్తున్నారు. మరో అడుగు ముందుకువేసి... అవన్నీ నోషనల్ ఖాతాలని, హక్కుదారులు అందుబాటులో లేకపోయినా, ఎవరైనా కచ్చితమైన డాక్యుమెంట్లు చూపకపోయినా అటువంటి ఖాతాల్లోకి మార్చుతామని, హక్కుదారులు వచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మార్చుతున్నామని చెప్పుకొస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ మార్పులు

ఎన్నికలు పూర్తయి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మ్యుటేషన్‌లో మార్పులు జరిగాయి. ఎక్కువ శాతం భూమి 2023 సంవత్సరంలో మారింది. కొన్ని ఈ సంవత్సరం మే, అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా ఆమోదించినట్లు నమోదు చేశారు. దీనినిబట్టి ఎవరైనా బలమైన వ్యక్తుల ప్రమేయం ఉందా అనేది అంతుబట్టని విషయం. అయితే ఈ ఐదు ఖాతా నంబర్లలో పట్టాదారులుగా చూపిన ఐదుగురు ఎవరనేది తేలాల్సి ఉంది.

- ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీలు
- జీ-2 లైసెన్స్ లేకుండా తయారీ
- గుంటూరు శివారు గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వినుకొండ అడ్రస్‌తో రైతులకు అంటగడుతున్న బిల్లులు

నకిలీ బయోలు

గుంటూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీల పేరుతో.. వారు కూడా గుర్తించనట్లుగా పురుగు మందులు, బయో ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. నకిలీ బయో మందులు, పురుగు మందుల అమ్మకాలు గుంటూరులో జోరుగా సాగుతున్నాయి. నకిలీ పురుగు మందులు, బయో ఉత్పత్తులు రైతులను నిండా ముంచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. జీ-2 అనుమతి కూడా లేకుండానే బయో ఉత్పత్తుల తయారీ.. అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ మధ్య కాలంలో కొందరు రైతులు బయో ఉత్పత్తులు, పురుగు మందుల కోసం గుంటూరు రూరల్ మండలం ఓబుల్‌నాయుడుపాలెం, యనమదల, నాయుడుపేటలోని జగనన్న కాలనీకి పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఆరా తీస్తే పల్నాడు జిల్లా వినుకొండ అడ్రస్‌తో హిమాలయ అగ్రిటెక్ పేరుతో బిల్లులు ముద్రించి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. వినుకొండ ప్రాంతానికి చెందిన నకిలీ బయోల మాఫియా నాలుగు నెలలుగా గుంటూరు రూరల్ మండలంలో మకాం వేసి నకిలీ బయోలు అమ్ముతున్నట్లు తెలిసింది. వారు రైతులకు ఇస్తున్న బిల్లుల ఆధారంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. ఆ పేరుతో బయో ఉత్పత్తుల అమ్మకాలకు అవసరమైన జీ-2 అనుమతి లేదని తెలుస్తోంది. కేవలం రైతులను నమ్మించేందుకు బిల్లులు తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

తక్కువ ధరని రైతులకు గాలం..

గతంలో ప్రముఖ పురుగు మందుల కంపెనీల్లో పనిచేసిన కొందరు వ్యక్తులను ఉద్యోగులుగా చేర్చుకుని గుంటూరు శివారులో నకిలీ బయోల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తుంది. తక్కువ ధరకే మంచి పురుగు మందులు లభ్యం అవుతున్నాయని చెప్పి రైతులను ఆకర్షిస్తున్నారు. రైతులు ఆయా ప్రాంతాల నుంచి గుంటూరు మార్కెట్ సెంటర్‌కి వస్తే నకిలీ కంపెనీకి చెందిన వ్యక్తులే ఆటోలు ఏర్పాటు చేసి వ్యాపార స్థావరానికి తీసుకుపోతున్నారు. రోజుకు 70 నుంచి 80 మంది రైతులను ఈ విధంగా తీసుకువచ్చి నకిలీ మందులు అంటగడుతున్నారు. ఈ విధంగా రోజుకు రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల వరకు నకిలీ బయోలు, పురుగు మందులు అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే వ్యక్తులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ మందులను విక్రయిస్తున్నారు. గోద్రెజ్ కంపెనీకి చెందిన గ్రాసియా పురుగుమందు పేరుతో నకిలీలను రైతులకు అంటగడుతున్నారు. బీఎస్ఎఫ్‌కు చెందిన ఎక్సోనస్, బేయర్ కంపెనీకి చెందిన కొన్ని పురుగు మందులను కూడా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రైతులు తక్కువ ధరకు వస్తున్నాయని ఆయా మందులను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవి పని చేయకపోవడంతో రైతులు వచ్చి ఘర్షణలు పడి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో నగదు వెనక్కి ఇచ్చినట్లు తెలుస్తోంది.

తెలంగాణ నుంచి తెచ్చి..

తెలంగాణ నుంచి ముడి పదార్థాలను తీసుకువచ్చి బయో ఉత్పత్తులను తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదే వ్యక్తులు అటు పల్నాడులోనూ గతంలో ఇదే రీతిలో నకిలీ మందులు భారీగా విక్రయించినట్లు తెలుస్తోంది. ఇటీవల అక్కడ దొరికిన నకిలీ బయోల డంప్ వ్యవహారంతో గుంటూరు ముఠాకు సంబంధాలు ఉన్నట్లు సమాచారం. అక్కడ దాడులు జరగడంతో ఇక్కడకు మకాం మార్చినట్లు ప్రచారం జరుగుతోంది.



పురుగు మందుల కంపెనీ పేరుతో ముద్రించిన నకిలీ ప్యాక్

ఎవరీ 'బాలు'

గుంటూరు శివారు గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా నకిలీ బయో ఉత్పత్తులు అమ్మకాలు జరుపుతున్న వ్యవహారంలో బాలు అనే వ్యక్తి కీలకంగా ఉన్నట్లు సమాచారం. రైతులను అక్కడకు తీసుకెళ్లే మధ్యవర్తులు ఆ పేరునే ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే సదరు వ్యక్తులు రైతులకు ఇస్తున్న బిల్లు మీద యజమాని స్థానంలో ఎవరి పేరు లేదు.

నిఘా ఉంచాం.. ఎవర్నీ వదలం

నకిలీ బయో ఉత్పత్తులకు ఎటువంటి అనుమతి లేకుండా కొందరు గుంటూరు శివారు గ్రామాల్లో విక్రయిస్తున్నారన్న వ్యవహారంపై నిఘా ఉంచాం. ఆయా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. నకిలీల వ్యవహారంలో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

- నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

- జనవరి పింఛన్ ఈ నెల 31నే పంపిణీ
- 30న బ్యాంకుల నుంచి నగదు డ్రాకు ఆదేశాలు
- యలమందలలో పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు

మూడో నెలా.. ముందస్తుగానే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రతీ నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రతీ నెల రికార్డులను అధిగమిస్తోంది. ఈ క్రమంలో ఒకటో తేదీ సెలవు దినమైతే ఆ తర్వాత రోజు కాకుండా ముందు రోజే పింఛన్ల నగదు అందజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తి అయి ఏడో నెల సమీపిస్తున్నది. అయితే ఇప్పటికి ఆరు నెలలు కూటమి ప్రభుత్వ నేతృత్వంలో పింఛన్లు పంపిణీ జరగ్గా జనవరి ఏడో నెల అవుతుంది. ఈ క్రమంలో ఒకటో తేదీ కంటే ముందుగానే ఇప్పటికి మూడు నెలలు పింఛన్ల పంపిణీ జరిగింది. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఆగస్టు 31న, డిసెంబరు 1 ఆదివారం కావడంతో నవంబరు 30న పింఛన్ల పంపిణీ జరిగింది. కొత్త సంవత్సరం జనవరి 1 కావడంతో ఒక రోజు ముందు డిసెంబరు 31నే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ 31న చేయాలంటే ఒక రోజు ముందుగానే పంచాయతీలు, మున్సిపాల్టీల వారీగా నగదును బ్యాంకుల నుంచి డ్రా చేయాలి. ఈ ప్రక్రియను ఈ సారి 30న చేపట్టనున్నారు. 31న మంగళవారం పింఛన్లు పంపిణీకి అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

95 శాతానికి పైగానే పంపిణీ..

వలంటీర్లు లేకుండా ఇంటింటా పింఛన్ పంపిణీ సాధ్యం కాదనే గత వైసీపీ ప్రభుత్వ వాదనను కూటమి ప్రభుత్వం అధిగమించింది. అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బందితోనే ప్రతీ నెల ఒక్క రోజులోనే 95 శాతానికిపైగా పింఛన్లను అందించగలిగింది. పల్నాడు జిల్లాలో 2,74,209 మంది పింఛన్‌దారులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో 2,28,615, గుంటూరు జిల్లాలో 2,54,610 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఈ నెలలో పల్నాడు జిల్లాలో 2,71,190(98.9 శాతం) మంది లబ్ధిదారులకు రూ.116,02,90,000, బాపట్ల జిల్లాలో 2,25,788(98.76 శాతం) మందికి రూ.94,28,68,00, గుంటూరు జిల్లాలో 2,51,900(98.94 శాతం) మందికి రూ.107,59,32,00 పంపిణీ చేశారు.

ఏర్పాట్లలో అధికారులు..

ప్రతి నెలా రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి పింఛన్ల పంపిణీని నరసరావుపేట నియోజకవర్గంలోని యలమందలలో చేపట్టనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలిప్యాడ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఆయా పనులను శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.



యలమందలలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్

8

ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్

- సచివాలయాల్లో వివరాల ప్రదర్శన

నిర్లక్ష్యపు నీడలో
కాకతీయ శాసనాలు

- రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి: పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

6

శుశృతహాల్‌లో
సదరం సర్టిఫికెట్ల జారీ కేంద్రం

31లోపు రైతులు
ప్రీమియం చెల్లించాలి

హోంగార్డుపై
కానిస్టేబుల్ దాడి

పెంచిన టోల్ ఫీజులను ఉపసంహరించుకోవాలి

- కాజ టోల్‌ప్లాజా వద్ద ఆటో వర్కర్ల నిరసన

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- ఎస్పీ ఎస్.సతీష్ కుమార్
- ఆటోనగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక డెమో



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

శుశ్రుతహాల్‌లో సదరం సర్టిఫికెట్ల జారీ కేంద్రం

గుంటూరు మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.15 వేలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొనే దివ్యాంగుల కోసం ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుతహాల్‌లో సదరం సర్టిఫికెట్ల జారీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పలు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ఇది వారికి ఇబ్బందికరంగా మారినట్లు తమ దృష్టికి రావడంతో వీరి కోసం శుశ్రుతహాల్‌లో ఒన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుశ్రుతహాల్ దగ్గర వీరి కోసం వీల్ చైర్లు, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. అక్కడే దివ్యాంగులకు ఓపీ టిక్కెట్లు జారీ చేయడంతో పాటు దరఖాస్తు పూర్తి చేయించి వైద్య పరీక్షలు, ధ్రువీకరణ పత్రం జారీకి ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజును కూడా కట్టించుకుంటారని ఆయన వివరించారు. అనంతరం వివిధ వైద్య విభాగాలకు చెందిన డాక్టర్లు శుశ్రుతహాల్‌కే వచ్చి దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని డాక్టర్ రమణ యశస్వి వెల్లడించారు. బుధవారం న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్ సర్టిఫికెట్లు జారీ చేస్తారని, గురువారం కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న వారికి, శనివారం కాలేయ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఆయన తెలిపారు.

మాదిగ కార్పొరేషన్లో ముగ్గురు జిల్లా వాసులు

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్లో జిల్లాకు చెందిన ముగ్గురు స్థానం పొందారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి బేతపూడి విజయ శేఖర్, తాడికొండ నుంచి కమ్మంపాటి శిరీష, మాచర్ల నుంచి సాతులూరి కుమార్‌లు డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

జీవో ప్రకారమే కేటాయింపులు

- సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్
- గ్రీవెన్స్‌కు పోటెత్తిన గ్రామ కంఠాల సమస్యలు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) సీఆర్డీఏ నిర్వహించిన గ్రీవెన్స్ డేకి గ్రామ కంఠాల సమస్యలు పోటెత్తాయి. గతంలో అన్యాయం జరిగిందని రైతులు గ్రీవెన్స్ డేను నిర్వహించిన సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ వద్ద వాపోయారు. ఒక్కొక్కరికి ఒక్కోరకంగా గ్రామ కంఠాలను కేటాయించారని వివరించారు. ఒకే సర్వే నంబర్‌లో పక్క పక్కనే ఉన్నా కాని ఒకరికి పది సెంట్లు కేటాయిస్తే, మరొకరికి ఇరవై సెంట్లు, అర ఎకరం, ఎకరం వరకు కేటాయించటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. పశువుల పాకలు, గడ్డి వాములు, గోదాములు, పొగాకు బేరన్‌లు, పశువుల మేతకు వినియోగించే భూమిని, ఇతర నిర్మాణాలు, ఊరికి ఆనుకొని ఉన్న స్థలాలను గ్రామ కంఠాల కింద గత టీడీపీ ప్రభుత్వంలోనే కేటాయింపులు జరిగాయి. గతం గురించి వద్దు, ఇప్పుడు మీ అప్పీలు ఏమిటనేది చెప్పండి, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచి జీవో ప్రకారం న్యాయం చేస్తామని అదనపు కమిషనర్ రైతులకు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి గ్రామ కంఠాల సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ గ్రీవెన్స్ డేలో రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ల్యాండ్ పూలింగ్ యూనిట్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్‌లు, సామాజిక అభివృద్ధి అధికారి బొర్రా శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెంచిన టోల్ ఫీజులను ఉపసంహరించుకోవాలి

- కాజ టోల్‌ప్లాజా వద్ద ఆటో వర్కర్ల నిరసన



కాజ టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, యాజమానులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా ఫీజులు దశల వారీగా పెంచుతూ వాహనదారులపై భారాలను మోపుతున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా సీఐటీయూ అనుబంధ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి మండలం కాజ టోల్ ప్లాజా వద్ద నిరసన తెలిపారు. ఆటో వర్కర్లు, యాజమానులు, డ్రైవర్లు, ఓలా, ఊబర్, ర్యాపిడో వాహనదారులు ర్యాలీగా టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. పెంచిన టోల్ ఫీజులను రద్దు చేయాలని, నెల వారీ పాసులను గతంలో మాదిరిగానే జారీ చేయాలని, ఎన్నిమార్లు తిరిగితే అన్నిసార్లు నగదు చెల్లించాలనే కొత్త నిబంధనను ఎత్తివేయాలని, స్థానికులకు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ టోల్ ఫీజుల పెంపు వలన వాహన యాజమానులపైనే కాకుండా ప్రజలందరిపైనా ఆ భారం పడుతుందని చెప్పారు. టోల్ ఫీజుల వసూలు దేశంలోనే అతి పెద్ద కుంభకోణంగా అభివర్ణించారు. ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 8 శాతం సెస్‌ను కేంద్రం రోడ్డు ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తుందని, మళ్లీ టోల్ గేట్ల పేరుతో వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఈ సెల్ రూ.3 వేలు ఉంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.8 వేలకు పెంచిందని, తాజాగా ప్రజలపై మరింత భారాన్ని మోపేలా అక్టోబరు నెల నుంచి ఫీజులను పెంచడాన్ని ఆయన తప్పుబట్టారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, నేతలు షేక్ మస్తాన్‌వలి, తన్నీరు శ్రీరాములు, గాంధీ రామమోహనరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగికి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కోప్ ఫౌండేషన్ ద్వారా సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం లభించింది. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ వీసీ చాంబర్లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం చేతుల మీదుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను డాక్టర్ కొండలరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రజల మధ్య సేవ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా నిరంతరం వారి అభ్యున్నతికి కృషి చేయడం అభినందించాల్సిన విషయం అన్నారు. కొండలరావు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం యూనివర్సిటీకి గర్వకారణం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ కొండలరావు సేవలను స్ఫూర్తిని తీసుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద్, వై.రాధాకృష్ణ, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రత్తయ్య, కోశాధికారి రాజకుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ కొండలరావును అభినందిస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు, అధికారులు

ఫెన్సింగ్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికలు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్-17, బాల, బాలికల విభాగాల్లో ఫెన్సింగ్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు దాదాపు 50 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో శనివారం నుంచి జరిగే ఏపీ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి డి.అశోక్‌బాబు తెలిపారు.


- ఎంపికైన క్రీడాకారులు: బాలుర (ఫాయిల్) విభాగంలో.. ఏ.శ్రీనివాసరావు, జోయల్ డేవిడ్, ఏ.సాయిచరణ్, బి.ప్రతాప్‌కుమార్. ఈప్పీ విభాగంలో.. ఈశ్వర్ పూర్ణసాయి, బి.తనూజ్, ఆర్.సుశాంత్, ఎం.భార్గవ్. సబార్ విభాగంలో.. ఎస్.కిరణేశ్వర్‌రెడ్డి, బి.ఆదిత్యసాయి, డి.డానియల్ నిహాల్, లియాకత్. బాలికల విభాగంలో.. మున్నీసా.

నేడు వర్సిటీలో పూర్వ విద్యార్థుల సమావేశం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఉదయం 11 గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలో ఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్
- ఆటోనగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక డెమో



డెమో నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఏఎస్పీ రమణమూర్తి

పెదకాకాని, గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, మీ కుటుంబానికి మీ అవసరం చాలా ఉన్నది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు ఎరగాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని పోలీస్ స్టేషన్ ఎదుట ఆటోనగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై హెల్మెంట్ ఎవర్నెస్ కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. యమధర్మరాజు, రాక్షసుల వేషధారణలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డెమో నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. గత ఆరు నెలల్లో జిల్లాలో 1000 పైగా రోడ్డు ప్రమాదం జరిగాయనీ, అందులో 411 మంది మరణించారన్నారు, మిగిలిన వారికి గాయాలు అయ్యాయని తెలిపారు. పెదకాకాని, తాడేపల్లి, గుంటూరు తాలూకా పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. హైవేపై ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధిస్తున్నామని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారికి తొలుత వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని, ఆ తర్వాత కేసులు పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ రమణమూర్తి, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి, పెదకాకాని సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో కార్పొరేట్ తరహా శిక్షణ

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్స్ పొందేందుకు కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్ రెడ్డి సెమినార్ హాల్‌లో ఇంజనీరింగ్ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్స్‌పై కోడ్ తంత్ర సంస్థ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ సీఆర్‌టీని వినియోగించుకొని విద్యార్థులు రాబోయే ప్రాంగణ ఎంపికల్లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించాలని కోరారు. గౌరవ అతిథి విట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ కుమార్ స్వామి మెటవర్స్ టెక్నాలజీ (వర్చువల్ వర్డ్), క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఓఎస్‌డి ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్ మాట్లాడుతూ పైథాన్ లాంగ్వేజ్ విశిష్టతను, వాటి అప్లికేషన్స్‌ను తెలిపారు. కోడ్ తంత్ర జోనల్ హెడ్ బి. చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంది జగనే

- రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్



రేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర విద్యుత్‌రంగంపై దాదాపు లక్షా 30వేల కోట్ల భారాన్ని మోపిన జగన్ ఇప్పుడు చిలకపలుకులు పలుకుతున్నాడని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. యూనిట్ రూ.5లకు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8 నుంచి రూ.14 వరకు కొనుగోలు చేసి ప్రజలపైన జగన్‌రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. సోలార్‌విండ్ ఎనర్జీ పీపీఏలను రద్దు చేసి రాష్ట్రానికి 10 వేల మెగావాట్లు పునరుత్పాదక విద్యుత్‌ను జగన్ అందుబాటులో లేకుండా చేశారన్నారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17వేల కోట్లు ట్రూఅప్ చార్జీలను పెంచాలని ఆనాడే జగన్ సర్కార్ ఆమోదించిందన్నారు. ట్రూఅప్ చార్జీలనే రెండేళ్లపాటు పెంచకుండా ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్‌సీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

జగన్ అబద్ధాన్ని జనం నమ్మడం లేదు

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌రెడ్డి అబద్ధాన్ని జనం నమ్మడం లేదని పోరుబాట వైఫల్యంతో మరోసారి తేలిపోయిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా పట్టుమని 10 మంది ప్రజలు కూడా వైసీపీ ఆందోళనలో లేరని అన్నారు. కనిపించిన కొద్దిమంది పార్టీ కార్యకర్తలు కూడా ఉదయం అటెండెన్స్‌లు వేయించుకొని జారుకోవడం జగన్, వైసీపీ దుస్థితిని తెలియజేస్తుందని తెలిపారు. జగన్ అద్దం ముందు నిలుచొని తనను తాను ప్రశ్నించుకోవాల్సిన విషయాలపై రోడ్లపైకి వెళ్లి ఆందోళనలు చేయడం వలన ఏం ఉపయోగమని చురకలు వేశారు.

వైసీపీ నేతలు డ్రామాలు ఆపాలి

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తొమ్మిదిసార్లు అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి, నిరసనల పేరుతో ఇప్పుడు వైసీపీ నేతలు చేస్తున్న డ్రామాలు ఇక ఆపాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అక్షరాల తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మర్చిపోయార అని ప్రశ్నించారు. ఈ రోజు తగ్గించాలని నిరసన పేరుతో వైసీపీ నేతలు పెద్ద డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న విద్యుత్ పోరుబాట డ్రామాలు, ఆ పార్టీ నేతలు విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద బురద చల్లటాన్ని తీవ్రంగా ఖండించారు. అవినీతి, అక్రమాల కేసుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు నిరసన కార్యక్రమాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో ముడుపులు కేసుల్లో అమెరికాలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి పోరుబాట పేరిట ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 40.18 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

న్యూరో మస్క్యులర్ మానిటర్ విరాళంగా అందజేత

గుంటూరు మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1999వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి మత్తు మందు వైద్య విభాగానికి రూ.1.60 లక్షల విలువైన న్యూరో మస్క్యులర్ మానిటర్‌ను శుక్రవారం విరాళంగా అందజేశారు. నాటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు డాక్టర్ టి నిర్మల, డాక్టర్ కే నవీన్, డాక్టర్ కే ఉమాశంకర్ న్యూరో మానిటర్ పరికరాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణఎస్ఎస్‌వీ చేతుల మీదుగా ఎనస్థీషియా విభాగానికి అందజేశారు. పూర్వ విద్యార్థుల వితరణను అభినందించారు.

క్యాజువాల్టీలో కుక్కకాటు ఇంజక్షన్లు

కుక్కకాటుకు గురయ్యే బాధితులకు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అత్యవసర వైద్య విభాగమైన క్యాజువాల్టీలో ఏఆర్‌వీ ఇంజక్షన్లు ఇస్తారని ఆసుపత్రి వైద్య వర్గాలు తెలిపాయి. కుక్కకాటుకు గురైన రోగులు నేరుగా క్యాజువాల్టీకి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ కుక్కకాటు గాయాన్ని శుభ్రం చేసి ఇంజెక్షన్ చేయడంతో పాటు కోర్సులో ఎన్ని ఇంజెక్షన్లు చేయించుకోవాలో సదరు మెడికల్ ఆఫీసర్ ఓపీ చీటిపై సూచిస్తారు. రెండో ఇంజెక్షన్ నుంచి కోర్సు చివరి వరకు రోగులు ఓపీలోని 14బీ వార్డులో ఏఆర్‌వీ ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. స్థానిక జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ భవనంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రస్తుతం చాంబర్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన చాంబర్ ఆఫ్ కామర్స్‌కు 3100 మంది సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. చాంబర్ సభ్యులతో పాటు అనుబంధ సంఘాల నుంచి కూడా సభ్యులు ఓటర్లుగా వ్యవహరిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బ్రాడీపేట 1/14వ లైను నుంచి 6/18వ లైను వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గుంటూరులో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా సంగం జాగర్లమూడి ప్లాంట్ నుంచి అదనంగా నీటిని వినియోగించుకోవడానికి తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంగం జాగర్లమూడి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు.

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నల్లచెరువు బొమ్మల సెంటర్, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అర్జీదారులతో మాటాడారు. ఆయా సమస్యలపై చర్చించి, పరిష్కార చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు.

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

● డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం శుక్రవారం నిర్వహించారు. అజెండా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు అవసరమైన స్థలాలు గుర్తించాలన్నారు. సింగిల్ విండో దరఖాస్తులకు నిర్ణీత గడవులోగా అనుమతులు మంజూరు చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్, హ్యాండ్లూమ్ క్లస్టర్‌ల డీపీఆర్‌లు సిద్ధం చేసి అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 26 క్లెయిమ్‌లకు రూ.2,38,27,930 మంజూరుకు కలెక్టర్ ఆమోదించారు.

ఈవీఎం గోడౌన్‌ని పరిశీలించిన కలెక్టర్

త్రైమాసిక తనిఖీలలో భాగంగా శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పరిశీలించారు. సీసీటీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించి వాటి గడవు ముగిసే తేదీని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిరంగిపురం మండలం రేపూడిలోని వ్యవసాయ మార్కెట్‌లో వీవీప్యాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను గుంటూరు ఆర్‌డీఓ కే శ్రీనివాసరావు తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీకి ఆదేశాలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసే అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీలు చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన గర్భస్థ పూర్వ- గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం (పీసీ పీఎన్‌డీటీ యాక్ట్)పై డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాపియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలను గుర్తిస్తే వాటిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి వాటి పనితీరుపై నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 294 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇటీవల వీటిలో 24 కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించామని, ఎక్కడా నిబంధనలు ఉల్లంఘన జరిగినట్లు రుజువు కాలేదని తెలిపారు. కొత్తగా మూడు కేందాలు రిజిస్ట్రేషన్ కోసం, నాలుగు కేంద్రాలు రెన్యువల్ కోసం, మరో తొమ్మిది కేంద్రాలు మాడిఫికేషన్ కోసం, ఒకటి రద్దు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. కమిటీ సభ్యులు వీటికి ఆమోదం తెలిపారు.



డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

8వ తరగతి విద్యార్థి హర్షిల్ కిరణ్‌కు కలెక్టర్ అభినందన

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షిల్ కిరణ్ గీసిన పక్షులు, అడవి జంతువుల ఛాయచిత్రాలతో రూపొందించిన కేలండర్‌ని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. రిజిస్ట్రేషన్ శాఖలో డీఐజీగా విధులు నిర్వహిస్తున్న తన తండ్రి కిరణ్‌కుమార్‌తో కలిసి హర్షిల్ కిరణ్ శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి కిరణ్ గతంలో సాధించిన జాతీయ స్థాయి పతకాలను పరిశీలించిన కలెక్టర్ అభినందించారు.



విద్యార్థి హర్షిల్ కిరణ్‌ని అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కౌన్సిల్ సమావేశం 4కు వాయిదా

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేడు జరగాల్సిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వచ్చే నెల నాలుగో తేదీకి వాయిదా వేశారు. మాజీ ప్రధాని మన్మో హన్ సింగ్ మృతి కారణంగా కౌన్సిల్ సమా వేశాన్ని వాయిదా వేసినట్లు సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. తిరిగి కౌన్సిల్ సమావేశాన్ని వచ్చే నెల 4న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన్మో హన్‌సింగ్‌కు సంతాపసభ శనివారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



కోటయ్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దుల కోటయ్య

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గానికి చెందిన మద్దుల వెంకట కోటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించి కోటయ్యకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మద్దుల వెంకట కోటయ్య యాదవ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. కోటయ్య మాట్లాడుతూ తనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడంపై కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రెసిడెంట్ వై నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ ఉన్నారు.

నాడు విద్యుత్ చార్జీలు పెంచి నేడు నిరసన డ్రామాలా?

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ఇప్పుడు తగ్గించాలని వైసీపీ నిరసన డ్రామాలాడడం ఆపాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గుజ్జనగుండ్లలోని విద్యుత్ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు ఆందోళనలు చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబుపై బురద చల్లేందుకు చేసిన ప్రయత్నాలను ఆమె తీవ్రంగా ఖండించారు.

జగన్‌రెడ్డి ధన దాహం వల్లే విద్యుత్ చార్జీల భారం: డేగల ప్రభాకర్

జగన్ రెడ్డి ధన దాహం వల్లే ప్రజలపై విద్యుత్ చార్జీల భారమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి తన పాలనలో వికృత చేష్టలతో విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేశాడని ఆరోపించారు.

విద్యుత్ చార్జీల ఎవరు పెంచారో జగనే చెప్పాలి?: పిల్లి మాణిక్యరావు

విద్యుత్ చార్జీల పెంపుపై సమరమంటున్న జగన్, ఆ విద్యుత్ చార్జీలు ఎవరు పెంచారో చెప్పాలని లిడ్ క్యాప్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు డిమాండ్ చేశారు. జగన్ పిలుపునకు ప్రజల స్పందన కరువైందని ఎద్దేవా చేశారు.

జగన్ కమీషన్ల పాపమే ప్రజలపై విద్యుత్ భారం: వేములకొండ శ్రీనివాస్

జగన్‌రెడ్డి కమీషన్ల పాపమే ప్రజలపై విద్యుత్ భారానికి మూలమని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీని వాస్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు చేయిస్తున్నారని విమర్శించారు.

పేదల ఆరోగ్యానికి చంద్రన్న భరోసా: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు భరోసా కల్పిస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే నసీర్ శుక్రవారం అందజేశారు. మూడో డివిజన్‌లో బోయ కోటేశ్వరమ్మకు రూ.90 వేలు, 13వ డివిజన్ చిన్నారి ఆరాధ్యకు రూ.50 వేలు, 15 డివిజన్‌కి చెందిన ఐలం కోటేశ్వరరావుకు రూ. 68,918 చెక్కులను అందజేశారు. జగన్ హయాంలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, నేడు విద్యుత్ చార్జీలు పెరుగుదలకు కారణమయ్యారన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారతదేశ అభివృద్ధికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి తీరని లోటని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మన్మోహన్ మృతిపై ఆమె సంతాపం వ్యక్తంచేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలోనూ మన్మోహన్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్‌వీ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య,అధ్యాపకులు విద్యార్థులు

మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య),డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు ఎనలేనివని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ వర్సిటీలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను మార్చేసి ఆర్థిక స్వేచ్ఛకుఆద్యుడయ్యారని కొనియాడారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా ఆయన నాయకత్వం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కార్య క్రమంలో వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ , ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో కేఎల్‌పీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసి కళాశాల రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1వ తరగతి విద్యార్థులు జీ స్వాతిక, జ్ఞానలక్ష్మీ, ముత్యం,ముతహీర్, షేక్ అహ్మద్, కే సుదీక్ష, షేక్ రిఫాత్, 2వ తరగతి నుంచి ఆర్ గౌతమ్‌కృష్ణ, ఆర్ మోహిత, జి లక్ష్మీదీప్తి, సిహెచ్ ప్రశంస, టీ మోనిక, 3వ తరగతి నుంచి ఆర్ వెంకటమోనీష్, ఎం సన్విత, సిహెచ్ హన్సీ, కె ద్వారకానందన్‌రెడ్డి, కె సమీర్, 4వ తరగతి విద్యార్థులు ఎస్ ఏస్తేర్‌ఇరాక్, సీహెచ్ తరుణ్యదేవి, సన్మతి, డికార్తీక్, ఆర్ రిత్విక్, 5వ తరగతి విద్యార్థులు డీ వెంకట విద్యారాణి, ఎస్ నిస్సీఒలివియ, కే అయ్యప్ప, తన్మశ్రీసాయి, కే మణికంఠ ప్రతిభ చూపారని వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ జీ రత్తయ్య అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జీ రత్తయ్య తదితరులు

సలాం నమస్తే సొసైటీ సేవలు ప్రశంసనీయం

● ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్ వెల్లడి

గుంటూరు మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సలాం నమస్తే గుంటూరు సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు సమాజం అభివృద్ధికి దోహదపడేవిగా ఉంటున్నాయని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిశెట్టి శివశంకర్ ప్రశంసించారు. సలాం నమస్తే గుంటూరు సొసైటీ, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం రాత్రి జరిగిన 'గుంటూరు గాట్ ట్యాలెంట్' అవార్డుల ప్రదానోత్సవం, కల్చరల్ ఈవెంట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ షమా సుల్తాన సలాం నమస్తే గుంటూరు సొసైటీ లోగోను ఆవిష్కరించారు. డాక్యుమెంటరీ, ఎస్ఎన్‌జీఎస్ అంథమ్ వీడియోను విడుదల చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్, ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానను అభినందించారు. అనంతరం గుంటూరు గాట్ ట్యాలెంట్ యాన్యువల్ ట్రోఫీని ఏబీసీడీ అకాడమీ నిర్వాహకులు కరీంకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, అవార్డు గ్రహీతలు సిరి, కాజల్, మణికంఠ, హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజర్ పీ నాగేశ్వరరావు, గోపి, అనిల్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో అంథమ్‌ను ఆవిష్కరిస్తున్న షమా సుల్తాన

విద్యుత్‌చార్జీల పెంపుపై వైసీపీ నాయకుల నిరసన

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేసి పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో గుజ్జనగుండ్ల సెంటర్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అంబటి రాంబాబు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పలువురు కార్పొరేటర్లు నిరసన తెలియజేశారు. అనంతరం డీఈఈ ఆర్ నాస రయ్య, ఏఈ నాగరాజులకు వినతిపత్రం అంద జేశారు. తూర్పు నియోజకవర్గంలో మాజీ ఎంపీ, ఉమ్మడి జిల్లా పార్టీ కోఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో సంగడి గుంట వద్దనున్న విద్యుత్ భవన్ ఎదుట లాంతరులతో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్ చార్జి ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తికి వినతిపత్రం అందజేశారు.

చండీఘర్ డిస్కమ్ విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చండీఘర్ డిస్కం విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శంకర విలాస్ సెంటర్ వద్ద సీ ఐ టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న డిస్కమ్‌ను ప్రైవేటీకరణ చేపట్టేందుకు బీ జే పీ కుట్ర పన్నుతుందని ఆరోపించారు.

చిప్స్‌లో ముగిసిన జాతీయ స్థాయి సైంటిఫిక్ పోటీలు

గుంటూరు(విద్య),డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటిక్ సైన్సెస్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సైంటిఫిక్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఆర్‌వీఆర్ జేసీ, చిప్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఫార్మాథాన్ 2024, ప్రోటో టైప్ చాలెంజ్ అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర వెల్లడించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 టీమ్స్ ఆన్‌లైన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలుగా నిలిచిన 12 టీమ్‌లకు చిప్స్‌లో ఫైనల్ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఆర్వీఆర్ అండ్‌జేసీ కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, రాధిక సజ్జా, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ పీవీఎస్ఎస్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


బాలికను ట్రాప్ చేసిన యువకుడు

● మగ శిశువు జననం ● కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు ట్రాప్ చేసి, శారీరకంగా దగ్గరవడంతో ఆ బాలిక ప్రసవించిన ఘటన స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు వివరాలు.. అరండల్‌పేట ప్రాం తానికి చెందిన పదహారేళ్ల బాలిక తమ ఇంటి సమీపంలోని కుళాయి వద్ద మంచినీరు పట్టుకునేందుకు వెళ్లేది. ఈ క్రమంలో అదే ప్రాంతంలో ఉండే 19 ఏళ్ల యువకుడు ఆ బాలికను ప్రేమ పేరుతో అత్యాచారం చేసినట్లు తెలిసింది. శుక్రవారం ఆ బాలిక ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో తల్లిదండ్రులు ఆ బాలికను జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న అరండల్‌పేట పోలీసులు ఆ బాలిక నుంచి వివరాలు సేకరించారు. ఆ యువకుడి కోసం పోలీసులు గాలిస్తు న్నారు. పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొంతుతో మాయ..

వారు గొంతుతో మాయ చేస్తారు.. తమ స్వరాలతో పలు రకాల ధ్వనులను అనుకరిస్తూ ఆశ్చర్యపరుస్తారు.. ప్రకృతి సవ్వడులు..పక్షులు, జంతువుల అరుపులు, రాజకీయ, సినీ ఇతర ప్రముఖులను అనుకరిస్తూ అందరిచేత ప్రశంసలు పొందుతున్నారు. ఒక విధంగా తమ కళతో ప్రజలను రంజింప చేస్తారు. వారే మిమిక్రి కళాకారులు...



- ఒకే గొంతులో లక్షలాది శబ్దాలు
- ధ్వనులను సృష్టిస్తున్న కళాకారులు
- మిమిక్రీతో ప్రజలకు వినోదం
- నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ధ్వనిని అనుకరించడం ఒక కళ. ఇతరుల గొంతును అనుకరించి మాట్లాడటం ఒక తమాషా.. ఒక వినోదం.. దాన్నే సింపుల్‌గా మిమిక్రీ అంటాం. దీనిలో చాలా తేడాలున్నాయి. ఒకరి గొంతును మాత్రమే అనుకరించడం గాక, చుట్టుపక్కల ఉండే ధ్వనులను అనుకరించడం.. ఉదాహరణకు గుర్రం పరుగెడుతున్నపుడు డెక్కల శబ్దం, రైలు బండి వెళుతున్న శబ్దం, మనుషులనే గాక జంతువులు, పక్షులు చేసే శబ్దాలు, వాటి కూతలు, అరుపులు, ఇలా వివిధ శబ్దాలను, గొంతుకలను....తన గొంతులో పలికించడమే, వినిపించడమే మిమిక్రీ కళ....అంతేగాక ఒక బొమ్మను తీసుకుని ఆ బొమ్మ మాట్లాడుతున్నట్లుగా, ఇతరులు గుర్తించలేని విధంగా...మనం మాట్లాడుతూ చేసే ప్రక్రియను వెంట్రిలాక్విజమ్ అంటారు. ఇది కూడా మిమిక్రీలో భాగమే..

నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం

శనివారం ప్రపంచమంతా మిమిక్రీ దినోత్సవం జరుపుకుంటోంది. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరళ్ల వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 28న మిమిక్రీ దినోత్సవం జరుపుకుంటున్నారు.

మిమిక్రీలో రకాలు

మిమిక్రీలో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా ఎల్లోనెస్, జోక్స్, సాధారణ హాస్యం, మెకానికల్, శబ్దాల అనుకరణ, జంతువులు, వాహనాల శబ్దాల అనుకరణ, వెంట్రాలాక్విజమ్‌లు ప్రధానమైనవి.

తెలంగాణలో ప్రత్యేక కోర్సు

మిమిక్రీలో శిక్షణ ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కోర్సును ఏర్పాటు చేసింది. 45రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తారు. ధ్వని అనుకరణతో పాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారు. అంతేగాక మిమిక్రీ కళాకారులతో ప్రముఖుల గొంతులతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. మన రాష్ట్రంలో ఈ కోర్సు అందుబాటులో లేదు. మిమిక్రీ కళను అభ్యసిస్తే భవిష్యత్తులో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని సీనియర్ కళాకారులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏపీలో కూడా ఈ కోర్సును అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

నిర్వీర్యమైన భాషా సాంస్కృతిక వేదిక

మిమిక్రీ కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భాషా సాంస్కృతిక వేదికను తీసుకువచ్చారు. దీని ద్వారా మిమిక్రీ ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో కళాకారులకు ఆర్థిక తోడ్పాటు, గుర్తింపు లభించింది. దీనికి తోడు గుర్తింపు పొందిన కళాకారులకు నెలకు రూ 5వేల వరకు గౌరవ వేతనం అందజేసేవారు. కానీ 2019లో వైసీపీ అధికారంలో రాగానే దీన్ని నిర్వీర్యం చేశారు. ప్రదర్శనలు, ఇతర కార్యకలపాలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో కళాకారులు ఉపాధి కోల్పోయారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో దీనిని పునరుద్ధరిస్తారని కళాకారులు ఎదురుచూస్తున్నారు.

పరిపూర్ణత లేకపోతే అపహాస్యం

హాస్యం ఆరోగ్యకరంగా లేకపోతే అపహాస్యం పాలవుతుంది. కొంత మంది ఈ మధ్యన మిమిక్రీ కళాకారులు నాలుగు జోక్‌లు, నాలుగు ధ్వని అనుకరణలు చేసి మమ అనిపిస్తున్నారు. దీంతో ఈ కళ ఆదరణ కోల్పోతోందని సీనియర్ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 45 నిమిషాల పాటు దీనిని ఏకదాటిన ప్రదర్శన నిర్వహించి, ప్రేక్షకులను ఆలరించాలని అంటున్నారు.

ప్రోత్సాహం అందించాలి



మిమిక్రీ ఒక ప్రత్యేక కళగా గుర్తించి కళాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలి. నేటి యువత దీనిపై ఆసక్తి కనబరచాలి. సరైన సాధన చేస్తే ఈ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. భవిష్యత్తులో అమరావతిలో మిమిక్రీ క్లబ్‌ను ఏర్పాటు చేసి, చిన్నారులకు శిక్షణ అందేలా కృషి చేస్తా.

\- కాసుల కృష్ణంరాజు, మిమిక్రీ కళాకారుడు, గుంటూరు

సరైన సాధన లేకపోతే ఈ రంగంలో రాణించలేరు..



నిత్య సాధన అవసరం. ఎప్పటికప్పుడు వైవిధ్యాన్ని ప్రదర్శించాలి. అప్పుడే ఈ రంగంలో మంచి అవకాశాలు వస్తాయి. నేటి తరం దీనిపై ఆసక్తి కనబరచకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం కూడా కళాకారులను ప్రోత్సహించాలి. దేశ విదేశాల్లో మిమిక్రీకి గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాను.

\- మిమిక్రీ శివ, గుంటూరు

ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్

- గ్రామ, వార్డు సచివాలయాల్లో వివరాల ప్రదర్శన
- నెలాఖరు వరకు అభ్యంతరాల స్వీకారం
- జనవరి 10న కులగణన తుది వివరాల విడుదల

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీల కులగణన ప్రారంభమైంది. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వాటి పరిధిలో నివాసం ఉంటున్న ఎస్సీల వివరాలను నోటీసు బోర్డుల్లో సిబ్బంది ప్రదర్శించారు. ఎస్సీల జనాభాపై సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు చేపట్టామని గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సచివాలయాల పరిధిలో నివాసం ఉంటున్న ఎస్సీలు ఆయా కార్యాలయాలకు వెళ్లి వారి వివరాలు సరిగా ఉన్నాయో, లేదో సరి చూసుకోవాలని సూచించారు. నోటీసు బోర్డుల్లో ప్రదర్శించిన వివరాలపై అభ్యంతరాలుంటే ఈ నెల 31 లోపు సంబంధిత గ్రామ/వార్డు సచివాలయంలో అందజేయాలని సూచించారు. అభ్యంతరాలను జనవరి ఒకటో తేదీ నుంచి 6 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాలను సేకరించిన అనంతరం 10న కులగణన తుది వివరాలను ప్రదర్శిస్తామన్నారు.

మూడు దశల్లో తనిఖీలు..

కులగణనపై మూడు దశల్లో తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం తదితర వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించుకుని అభ్యంతరాలను సచివాలయంలో వీఆర్‌వోకి అందజేయాల్సి ఉంటుంది. ఆ వివరాలను వీఆర్‌వో సంబంధిత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పిస్తారు. వీటిని ఆర్‌ఐ పునర్ పరిశీలన చేసిన తర్వాత తహసీల్దారుకు సిఫార్సు చేస్తారు. అనంతరం తహసీల్దారు తనకు అందిన వీఆర్‌వో, ఆర్‌ఐల నివేదికను పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఇలా పొందుపరిచిన వివరాల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారులతో 50 మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తారు. సోషల్ ఆడిట్‌ని కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్‌డీవో, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సహకారంతో పర్యవేక్షిస్తారు. ఈ దృష్ట్యా జిల్లాలోని ఎస్సీలంతా వచ్చే మంగళవారం సాయంత్రంలోపు వీటి చూసుకుని సచివాలయానికి వెళ్లి వారి వివరాలు సక్రమంగా పొందుపరిచారో, లేదో సరి చూసుకోవాలి.

ఎస్సీ కులాల ఉపవర్గీకరణకు ఇదే ప్రామాణికం

కాగా కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ప్రక్రియని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఏకసభ్య కమిషన్‌ని విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రాతో ఏర్పాటు చేసింది. ఆయన ఈ నెల 30న గుంటూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కులగణని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కులగణన ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ జరగనున్నది.



సచివాలయంలో ప్రదర్శించిన ఎస్సీ జనాభా వివరాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిత్యనూతన విద్యార్థిగా ఉండాలి

- నైపుణ్యాలే ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు తొలిమెట్టు
- టీసీఎస్ సీనియర్ కన్సల్టెంట్ ఎంఎస్ఆర్ మూర్తి
- అట్టహాసంగా ప్రారంభమైన ఆర్వీఆర్అండ్‌జేసీ కొలరిడో ఫెస్ట్

గుంటూరు(విద్య),డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యం మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అందిపుచ్చుకుని యువత నిత్య విద్యార్థిగా ముందుకు సాగాలని, చదువుతోపాటు నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ ఎంతో అవసరమని టీసీఎస్ సీనియర్ కన్సల్‌టెంట్ ఎంఎస్ఆర్ మూర్తి ఉద్బోధించారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కొలరిడో-2024 జాతీయ ఫెస్ట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఎంఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో కొత్త పుంతలు తొక్కుతోందని అందుకనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకోవాలన్నారు.

యువతలో జోష్ నింపిన వేడుకలు

జాతీయ కొలరిడో ఉత్సవాల్లో ఎల్‌వైఎఫ్(లవ్ యువర్ ఫాదర్) సినీ బృందం కళాశాలలో సందడి చేసింది. సినీ తారలు శ్రీహర్ష, కశికా కపూర్ బృందం విద్యార్థుల్లో జోష్ నింపారు. అంతే కాకుండా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ ఆర్ అండ్ డి డాక్టర్ కొమ్మినేని రవీంద్ర డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్ఆర్ మూర్తి



సినీ తారలు శ్రీహర్ష, కశికా కపూర్ నృత్యాలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఐదుగురికి.. రూ.వెయ్యి కోట్ల భూములు

- పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ

(5వ పేజీ తరువాయి..)

ఉంటారా అనేది తెలియాలి.

- అధికారులు చెబుతున్నట్లు నోషనల్ ఖాతా అంటే దానిలో ఉన్న 70కిపైగా సర్వే నంబర్లలో పట్టాదారుడి పేరు ఒకరిదే ఉండకూడదు. ఇక్కడ ఒక ఖాతాకు ఒకరి పేరే అన్ని సర్వే నంబర్లకూ ఉండటం కుంభకోణానికి పాల్పడ్డారనే అనుమానాలకు బలం చేకూర్చుతుంది.
- తాత్కాలిక ఖాతా అయినా, శాశ్వత ఖాతా అయినా, దానిలో ఒక పేరుపైనే అన్ని సర్వే నంబర్లు ఉండటం, పైగా వాటన్నిటినీ ఒకే తేదీతో మ్యుటేషన్ ఆమోదించడం కూడా అనుమానం కలిగిస్తున్నది.
- వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్ ద్వారా మార్పులు చెయ్యాలంటే ఖచ్చితంగా తహసీల్దారుకు తెలియకుండా జరగదు. ఒకవేళ కిందిస్థాయి సిబ్బంది మార్పులు చేశారనుకున్నా, ఒకటి, రెండు సర్వే నంబర్లు మినహా ఒకేసారి 70కిపైగా నంబర్లను మార్చలేరు. మార్చినా తహసీల్దారుకు తెలిసిపోతుంది.
- ఆ భూములను చూపించి ఎవరో పేరుతో భారీగా రుణాలు దోచేసిన పరిస్థితుల వంటివి ఏమైనా ఉన్నాయా! అనేదికూడా పరిశీలించాల్సిన అంశమే.
- విలువైన భూములను రికార్డుల్లోకి ఎక్కించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉన్నా, అధికారులు పూర్తి నిర్లక్ష్యంతోనో, లేక నేతలు చెప్పినట్లో మార్చేశారనేది వస్తున్న విమర్శ.
- ఒకవేళ పొరపాటుగా జరిగినా, అక్కడక్కడ ఖాతా నంబర్లలో పొరపాట్లు జరగడం సహజం. కానీ ఇక్కడ వరుస ఖాతా నంబర్లను చూస్తే ఉద్దేశ పూర్వకంగానే చేశారనేది సీనియర్ అధికారుల అనుమానం.
- నోషనల్ ఖాతాలంటే ఆ నంబరు ఆరు అంకెల్లో ఉంటుంది. కానీ నాలుగు అంకెల్లో ఉన్న ఖాతాలను నోషనల్ ఖాతాలని అధికారులే చెప్పడం చూస్తే ఇందులో ఏదో మతలబు ఉందని తెలుస్తోంది. నోషనల్ పేరుతో తప్పుదారి పట్టించే ప్రయత్నం కూడా అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

మామూళ్ల దోపిడీ

ఈ భూమాయ విషయంలో భూ హక్కుదారులను రెవెన్యూ సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ భూమి ఎవరి ఖాతాలోనో నమోదైందని తెలుసుకున్న యజమానులు మార్పుల కోసం అర్జీలు పెట్టుకుంటే, వారి భూమి విస్తీర్ణం, ధరను బట్టి రూ.10 లక్షల వరకు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారు అడిగినంత ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుతున్నారని బాధితులు చెబుతున్నారు. సచివాలయం ద్వారా అర్జీ పెట్టుకుంటే, దానిపై తహసీల్దారు తర్వాత స్థానంలో ఉన్న అధికారి సంతకం ఉంటే కానీ అది ఆన్‌లైన్‌లోకి రావడంలేదు. సంబంధిత అధికారిని కలిసి, ఆయన అనుమతి తీసుకొస్తే దరఖాస్తు ఆన్‌లైన్ అవుతుందని కొన్ని సచివాలయాల్లోని సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారంటే దోపిడీ ఎంత పగడ్బందీగా జరుగుతుందో అర్థమవుతుంది. ప్రధానంగా ఇద్దరు అధికారులు ఈ వ్యవహారంలో పీడించిమరీ వసూళ్లకు పాల్పడుతుంటే, బాధితులు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఇటీవల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆ అధికారులను తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. అయినా వారిలో మాత్రం మార్పు లేదని తెలుస్తోంది.

పరిశీలించి సరిచేస్తాం

ఆ ఖాతాలు 2016లో మార్పులు జరిగిపోయినవి. అప్పట్లో హక్కుదారులు రాకపోవడంతో వాటిని తాత్కాలిక ఖాతాల కింద నోషనల్ అకౌంట్‌లో నమోదు చేశాం. ఎవరైనా తమ సర్వే నంబర్లు మారాయని వస్తే, వారి పత్రాలు పరిశీలించి మార్పులు చేస్తాం. ఇందుకు ఎవరూ డబ్బులు డిమాండ్ చెయ్యరు. ఒకవేళ చేసినా ఇవ్వాల్సిన పనిలేదు. నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటా. మొత్తం ఖాతాలను పరిశీలించి, పొరపాటు ఎక్కడ జరిగిందో చూసి త్వరలోనే సరిచేస్తాం.

\- జియావుల్‌హక్, తహసీల్దారు పొన్నూరు

డిఫెన్స్ లిక్కర్.. జార్ఖండ్ నుంచి గుంటూరుకు

- ఇద్దరు నిందితుల అరెస్టు, 70 మద్యం బాటిళ్ల సీజ్

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రం నుంచి గుంటూరుకు డిఫెన్స్ లిక్కర్ తీసుకొచ్చి అమ్ముతున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్లు గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ సీఐ వై యశోదరాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన బాలాజీబాబు సింహాద్రి, బోలగాని వెంకటేశ్వరరావు జార్ఖండ్ నుంచి డిఫెన్స్ లిక్కర్ తీసుకొచ్చి గుంటూరు పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు చుట్టుగుంట వీఐపీ రోడ్డు చివర సింహాద్రి, వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు 70 ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఏఈఎస్ ఈడే మారయ్యబాబు, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యాన్ని స్వాధీనపరుచుకుని నిందితులను అరెస్టు చేసిన సీఐ యశోదరదేవి, ఏఈ మారయ్య

ఆర్వీఆర్‌జేసీలో.. సకుటుంబనామ్ సందడి



సకుటుంబ నామ్ చిత్ర బృందం సభ్యులు

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'సకుటుంబ నామ్' చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర కథా నాయకుడు రామ్ కిరణ్, దర్శకుడు ఉదయ్ శర్మ మాట్లాడుతూ కొత్త కథ అంశంతో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా సినిమాను రూపొందించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రోహిత్, నటులు నవీన్ జీవీ, రచ్చరవి, నిత్య, సిమ్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల యోధుడు మన్మోహన్‌సింగ్

- రాజీవ్‌గాంధీ భవన్‌లో పలువురు నేతల నివాళులు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఒడిదుడుకులతో తల్లడిల్లుతోన్న సమయంలో ఆర్థిక సరళీకృత విధానాలతో దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన గొప్ప సంస్కరణల యోధుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని పలువురు నేతలు కొనియాడారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులతో మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా మన్మోహన్‌సింగ్ చేసిన సంస్కరణలతో దేశ ఆర్థిక పరపుష్టతకు బాటలు పడ్డాయన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో దేశ ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించారన్నారు. పనికి ఆహార పథకం, సమాచార హక్కు చట్టం మన్మోహన్ సింగ్ తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, గడ్డం పాల్ విజయ్‌కుమార్, వాసు, జయసుధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని అవనతం చేసి జోహార్ మన్మోహన్‌సింగ్ అంటూ నాయకులు నివాళులర్పించారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డొక్కా లింగంశెట్టి, మస్తాన్‌వలి, విజయ్‌కుమార్ తదితరులు


నిర్లక్ష్యపు నీడలో కాకతీయ శాసనాలు

- రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



శాసనాలు, శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామ శివారులోని వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో నిర్లక్ష్యానికి గురైన క్రీ.శ. 10-13 శతాబ్దాల నాటి శిల్పాలు, శాసనాలను భద్రపరిచి, కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వారసత్వ సంపదను గుర్తించి, పరిరక్షించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రొంపిచర్లలో పర్యటించి పలు చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ వెలుపల, వినాయక ఆలయం ముందు రోడ్డుపై, మదన గోపాల దేవాలయానికి వెళ్లే దారిలో, క్రీ.శ 10వ శతాబ్దానికి చెందిన మహిషాసురమర్దిని, బ్రహ్మ, కుమారస్వామి, భైరవ, నంది విగ్రహాలు, ఇంకా కాకతీయ గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు విడుదల చేసిన రాతి శాసనాలు ఆలనా పాలనా లేక గడ్డి, గాదం మధ్య పడివున్నాయన్నారు. గణపతి దేవుని శాసనంలో స్థానిక కేశవ దేవునికి, క్రీ.శ.1320 నాటి ప్రతాపరుద్రుని శాసనంలో స్థానిక అనంత గోపీనాథ దేవుని అమావాస్య కొలువులకు రెడ్ల చెరువు వెనక కొంత భూమిని దానం చేసిన వివరాలు, అలాగే క్రీ.శ. 1245 నాటి కోట భీమరాజు మంత్రి వల్లభుడు, రొంపిచర్లలో కట్టించిన గోపీనాథ ఆలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలు వున్నాయని ఆయన చెప్పారు. రొంపిచర్ల గ్రామ చరిత్రకు సాక్ష్యాలైన ఈ శిల్పాలు, శాసనాలను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించాలని శివనాగిరెడ్డి గ్రామస్తులకు, ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుప్పల్ శ్రీనివాస్ పద్మ వంశీ, స్థపతి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



శాసనాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి తదితరులు

నిరాదరణ కారణంగా శబరిమల ప్రత్యేక రైళ్ల రద్దు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నిరాదరణ కారణంగా జనవరి నెలలో పలు శబరిమల ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 24న నంబరు. 07167 మౌలాలి - కొట్టాయం, 25న నంబరు. 07168 కొట్టాయం - మౌలాలి, 07171 మౌలాలి - కొట్టాయం, 26న నంబరు. 07169 కాచీగూడ - కొట్టాయం, 27న నంబరు. 07172 కొల్లం - మౌలాలి, నంబరు. 07170 కొట్టాయం - కాచీగూడ, 07157 నరసపూర్ - కొల్లం, 28న నంబరు. 07065 హైదరాబాద్ - కొట్టాయం, 29న నంబరు. 07158 కొల్లం - నరసపూర్, నంబరు. 07066 కొట్టాయం - సికింద్రాబాద్, 31న నంబరు. 07167 మౌలాలి - కొట్టాయం, ఫిబ్రవరి 1న నంబరు. 07168 కొట్టాయం - మౌలాలి రైళ్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని యాత్రీకులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

మార్చి నెలాఖరు వరకు పలు ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైళ్ల సేవలను మార్చి నెలాఖరు వరకు పొడిగించినట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్ - రామనాథపురం - సికింద్రాబాద్, నాందేడ్ - ఈరోడ్ - నాందేడ్, కాచీగూడ - నాగర్‌కోయిల్ - కాచీగూడ, కాకినాడ టౌన్ - లింగంపల్లి - కాకినాడ(ట్రైవీక్లీ), హైదరాబాద్ - కటక్ - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లను మార్చి వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

దళితుల జీవితాలతో గత ప్రభుత్వం చెలగాటం

● మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం దళితుల జీవితాలతో చెలగాటమాడిందని, అందుకు వెలగపూడిలో ఐదేళ్ల కిందట జరిగిన హత్యే ఉదాహరణ అని మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో డిసెంబరు 27, 2020న జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసులో 34 మంది నిందితులను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. వెలగపూడికి చెందిన నిందితులు, వారి బంధువులు భారీ సంఖ్యలో మంగళగిరి కోర్టు వద్దకు చేరుకున్నారు. మాణిక్యవరప్రసాద్ వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ హత్య కేసుతో సంబంధం లేని అనేక మంది దళితులను పోలీసులు నిందితులుగా చేర్చారని, వారిలో అమాయకులు, జరుగుబాటు లేని నిరుపేదలు, రోజు వారీ కూలీలు ఉన్నారని చెప్పారు. ఇటువంటి కేసుల్లో అమాయకులకు శిక్షణ పడకుండా సమగ్ర దర్యాప్తు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఓటర్ లిస్టు దగ్గర పెట్టుకుని మూకుమ్మడిగా అరెస్టులు చేయడం తగదన్నారు. గత ఐదేళ్లు హత్య కేసు ఇచారణ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ముప్పై సంవత్సరాలు అధికారంలో తామే ఉంటామనే దుర్మార్గపు ఆలోచనతో ఈ



మంగళగిరి కోర్టు వద్ద దళిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాణిక్యవరప్రసాద్

కేసులు ఏమీ చేయవని మభ్యపెట్టి అమా యకులైన దళితులను కేసులో ఇరికించారని ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగిందని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇచ్చారని తెలిపారు. హత్య కేసు విచారణ సక్రమంగా చేయకుండా అమాయకులను కేసులో ఇరికించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

క్వారీలో అధికారుల తనిఖీలు

తాడేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని కొండ (మట్టి) క్వారీలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తూ క్వారీ వద్దకు వచ్చి సమాచారం సేకరించారని తెలిసింది.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన

మంగళగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తూ మంగళగిరి అర్బన్ పోలీసులు పట్టణంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలు, ధరించకపోతే జరిగే నష్టాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల జాబితా ప్రచురణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు సంబంధించి సామాజిక తనిఖీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఎంటీఎంసీ పరిధిలోని 20 సచివాలయాల్లో, మండల పరిధిలోని 21 సచివాలయాల్లో షెడ్యూల్ కులాల జాబితాను ప్రచురించినట్లు తహసీల్దారు కే దినేష్ రాఘవేంద్ర తెలిపారు. షెడ్యూల్ కులాల జనాభా రికార్డు తయారు చేయడం కోసం ఈ జాబితాలను ప్రచురించడం జరిగిందని, దీనిపై సంబంధిత వ్యక్తులు, తృతీయ పక్షం నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలు తెలియజేయవచ్చని చెప్పారు. అన్ని ఫిర్యాదులను పరిష్కరించిన అనంతరం సచివాలయాల్లో తుది జాబితాను ప్రచురిస్తామని తెలియజేశారు.

ధ్యానంతో అంతరంగం పరిశుభ్రం

దుగ్గిరాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధ్యానమార్గాన్ని అనుసరించడం ద్వారా మానవుని అంతరంగం పరిశుభ్రమవుతుందని రామచంద్రమిషన్ జోనల్ కో-ఆర్డినేటర్ సుంకర కోటేశ్వర రావు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని శ్రీసద్గురు శుభవేదికలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకూ గంటన్నర పాటు ధ్యాన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, మన మనసు లక్షణాలను మనమే తెలుసుకుని, మనకు వచ్చే ఆలోచనలను నియంత్రించడం ద్వారా ఆవేశాన్ని, ఆవేదనను దూరం పెట్టవచ్చని చెప్పారు. శరీర ధర్మాన్ని పాటిస్తూనే ధ్యానంలో సూక్ష్మాన్ని గ్రహించాలన్నారు. ఎంతసమయం ధ్యానంలో ఉన్నామనేది ముఖ్యం కాదని, ఏకాగ్రతతో ధ్యానంపై మనస్సు లగ్నం చేస్తున్నామా లేదా అన్నదే ప్రధానమన్నారు. ధ్యానం ఖచ్చితంగా ఆనందంగా, ఉత్సాహంగా గడిపేందుకు దోహద పడుతుందని చెప్పారు. ధ్యాన శిక్షణలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్స్‌ను పరిశీలించిన ఆర్డీవో

ఫిరంగిపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపూడిలో వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపరిచిన వీవీ ప్యాట్స్‌ను, సీసీ టీవీల పనితీరు, భద్రతా ప్రమాణాలను ఆర్డీవో కే శ్రీనివాసరావు పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ జీ అరుణకుమారి, అగ్నిమాపక శాఖ అధికారి కే నవీన్‌కుమార్, విద్యుత్ శాఖ అధికారి బొంతా ఆనంద్ కుమార్, మండల టీడీపీ నాయకుడు మండవ నరసింహారావు, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, జనసేన నాయకులు, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మేజర్ కాల్వల్లో తూటాకు తొలగిస్తాం

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో మల్లాయపాలెం, కాకుమాను మేజర్ కాల్వలను శుభ్రం చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ డీసీ కమిటీ చైర్మన్ కల్లూరి కుసుమ తెలిపారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల పరిధిలోని పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న మల్లాయపాలెం మేజర్, కాకుమాను మేజర్ కాల్వలను ఎన్ఎస్‌బీ డీఈ శ్రీనివాసరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. స్థానిక రైతులతో ఆమె మాట్లాడారు. సాగునీటి కోసం వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. మురుగు కాలువలు, పంట కాల్వలు కలిసే చోట నిర్మించిన సైఫన్‌లను పరిశీలించారు. కింద నుంచి ప్రవహించే నీరు సైఫన్ వద్ద వృథాగా కాల్వలో కలుస్తున్నాయని, సుమారు ఐదు ఇంజన్ల నీరు పోతోందని రైతులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ కాల్వల్లో పేరుకుపోయిన తూటాకు, జమ్మును తొలగించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, పెదనందిపాడు మండల పార్టీ అధ్యక్షుడు విక్రయాల సుబ్బారావు, జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం కొండంత భరోసా

పెదనందిపాడు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యకర్తలకు కొండంత భరోసా అని మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా వేణు అన్నారు. మండల పరిధిలోని కొప్పర్రులో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేనంత కార్యకర్తల బలం, ఆదరణ ఒక్క తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు. సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా నమోదు చేసుకుంటున్నారన్నారు. కార్యకర్త ధైర్యంగా ఉంటే పార్టీ దృఢంగా ఉంటుందని, తద్వారా రాష్ట్రం పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు. గ్రామపార్టీ అధ్యక్షుడు యేలూరి గోపి, నాయకులు బత్తిని వేణు, యేలూరి సురేష్, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, శాఖమూరి మోహనరావు, జాష్టి నరేంద్ర పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

పెదనందిపాడు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి) : ఆయా సచివాలయాల్లో సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ సర్వే ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ నిర్వహించడం జరిగిందని, దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోడేటి ఏసుపాదం అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల వద్ద ఎస్సీ ఉప కులాలకు సంబంధించిన సమాచారాన్ని నోటీసు బోర్డులో ఉంచారని, ఆయా గ్రామాల్లో ఎస్సీ, ఎస్సీ ఉపకులాలకు సంబంధించిన డేటాను పరిశీలించి ఏవైనా తప్పిదాలు ఉంటే వెంటనే సిబ్బందికి తెలియజేయాలని కోరారు. జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలు సీక్వరించడం జరుగుతందని తెలిపారు. తొలుత ఈ నెల 30న ఎస్సీ, ఏబీసీడీ వర్గీకరణ పూర్తి చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషనర్ జిల్లా పర్యటనకు వస్తున్నారని, దీనిపై అవగాహన కలిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కారుమూరి అంకయ్య, కైసర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెదనందిపాడు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు శుక్రవారం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజధాని అమరావతిలో పచ్చదనం పరిరక్షణ

తుళ్లూరు, డిసెంబరు 27:(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలో పచ్చదనం పరిరక్షణకు ఏడీసీ చర్యలు తీసుకుంటోంది. పైలెట్ ప్రాజెక్టుగా ఏడీసీ సంస్థ చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ పార్థసారధి నేతృత్వంలో ఉద్యాన విభాగాధిపతి వి.ధర్మజ, ఇతర సిబ్బంది శుక్రవారం సీడ్ యాక్సెస్ రోడ్డుపై ఒక కిలోమీటరు మేర చెట్లపై డ్రోన్ సాయంతో పోషకాలను వెదజల్లారు. పూల మొక్కలను, చెట్లను సంరక్షించే నిమిత్తం పోషకాలను పిచికారి చేస్తున్నారు. అమరావతి నగరానికి వచ్చే అతిథులను విశేషంగా ఆకర్షిస్తున్న తబోబియా రోజియా పూల మొక్కలకు 13-0-45 (మల్టీకె) ఫార్ములాతో పోషకాలను డ్రోన్‌సాయంతో పిచికారి చేశారు. సీడ్ రోడ్డుపై పది కిలోమీటర్లు మేరకు ఉన్న ఈ మొక్కలను సంరక్షించనున్నారు. డ్రోన్‌ల సాయంతో భారీ వృక్షాలకు సైతం సులభంగా పోషకాలను అందిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా నీటి వృథాను కట్టడి చేసి 20 రెట్లు లాభాలు సాధించవచ్చు. రాబోయే రోజులలో రాజధానిలో నిర్మాణమయ్యే 35 ప్రధాన రహదారుల వెంట పచ్చదనం పరిరక్షణకు ఏడీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై విచారణ

తాడికొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తాడికొండ శివారు బడేపురం కొండ వెనుక గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భం మైనింగ్ ఆర్ఐ అంజనేయులు మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కొంత మేరకు కొలతలు సేకరించామని, కొండ ప్రాంతంలో గోతులు ఎక్కువగా ఉండటంతో పాటు, నీళ్ల నిలబడి ఉండటంతో కొలతలు తీసు కోలేక పోయామని తెలిపారు. పూర్తిగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. గ్రావెల్ తవ్వ కాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో లేదని, రెవెన్యూ అధికారులతో చర్చించి రికార్డులు పరిశీలించి నివేదికలు ఇస్తామన్నారు. పరిశీలించిన వారిలో మైనింగ్ సర్వేయర్ సీతమ్మబాయి, వీఆర్‌వో రాంబాబు, విలేజ్ సర్వేయర్ గోపి, గ్రామస్తులు ఉన్నారు.

దేశానికి మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి

గుంటూరు(విద్య),డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు ఎనలేనివని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ వర్శిటీలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు శుక్రవారం ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా రత్తయ్య మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను మార్చేసి ఆర్థిక స్వేచ్ఛకు ఆద్యుడయ్యారని కొనియాడారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా ఆయన నాయకత్వం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ , ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

మేడికొండూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపాలెంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు, కళాశాల ఏవో బండారు సీతారామయ్య మాట్లాడారు.

కాకుమాను, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. విద్యార్థి దశ నుంచే దేశభక్తి కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి కెన్నడీ విద్యార్థులకు సూచించారు. దేశ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసిన మన్మోహన్‌ను దేశ ప్రజలు ఎన్నటి



నివాళులర్పిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, అధ్యాపకులు, విద్యార్థులు

కి మరవరని ఆయన అన్నారు. మన్మోహన్‌కు సంతాపం తెలిపిన వారిలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ ఉన్నారు.

మంగళగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతిపై మంగళగిరి కాంగ్రెస్ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక గణపతి నగర్‌లోని రుషి యోగ మందిరంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా అద్భుతమైన సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, నేతలు రేమిడిశెట్టి హనుమంతరావు, మంద్రు శ్రీనివాస కుమార్, దామర్ల మల్లేశ్వరరావు, బుల్లా సమర్పణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వ్రత మహోత్సవం

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలకరత్న ట్రస్టు ఆధ్వర్యంలో మంగళగిరి మండలం ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. త్రిదండి చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రతిరోజు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ధనుర్మాస మహోత్సవాల్లో పన్నెండవ రోజున శుక్రవారం 12వ పాశురాన్ని చినజీయర్ స్వామి భక్తులకు వివరించారు. గోదా దేవికి అష్టోత్తరం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినజీయర్ స్వామి భక్తులకు తీర్థప్రసాదా లను పంపిణీ చేసి మంగళా శాసనాలను అందజేశారు. పెనుమాక, కొండపల్లి, సత్యనారాయణ పురం, రావిపాడు, మాదల నుంచి సుమారు 700 మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పిం చారు. సాయంకాలం సామూహిక శ్రీలక్ష్మీ పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, సంకీర్తనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

కృష్ణానదిలో 12.50 లక్షల చేప పిల్లల విడుదల

తాడేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా ప్రకాశం బ్యారేజి సీతానగరం పడవల రేవు వద్ద శుక్రవారం సాయంత్రం సీడ్ స్టాకింగ్ కమిటీ సభ్యుల సమక్షంలో 12.50 లక్షల చేప పిల్లలను అధికారులు, స్థానిక నేతలు నదిలో విడుదల చేశారు. ఇందులో లబ్ధిదారుని వాటా 60 శాతం కింద గవర్నమెంట్ ఫిష్ సీడ్ ఫారం, నిడుబ్రోలు నుంచి 10 లారీలలో 10.25 లక్షల చేప పిల్లలు (బొచ్చె, రాగండి) అదే విధంగా కూచిపూడి ఫిష్ సీడ్ ఫారం నుంచి రెండు లారీలలో 2.25లక్షల చేప పిల్లలను నదిలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రాజెక్టు మేనేజర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గుంటూరు అధికారిణి, మత్స్యశాఖ అధికారిణి ఏ లక్ష్మీకుమారి, తాడేపల్లి తహ శీల్దార్ సీతారామయ్య, ఎండీ జెనుల్లా ఖాన్, కె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా నదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న లక్ష్మీకుమారి, సీతారామయ్య

ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించండి

మేడికొండూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం సిరిపురంలోని బాలయేసు నామకరణ దేవాలయంలో డిసెంబరు 31వ తేదీ రాత్రి నుంచి జనవరి 1 అర్ధరాత్రి వరకు జరిగే తిరునాళ్ల ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మేడికొండూరు సిఐ నాగూర్ మీరా సాహెబ్ చెప్పారు. సిరిపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేవాలయ మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు జాగ్రత్త వహించాలని తెలిపారు. ఫాదర్ ఎస్‌వీ థామస్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు ఏరువ సౌరెడ్డి, జోసఫ్ రెడ్డి, పసల మరియదాసు, కాసు జోసఫ్ రెడ్డి, పంచాయితీ వార్డు సభ్యులు విజయ, దొప్పలపూడి సాయి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కుప్పరావు కాలనీలోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైసీపీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పెంచిన చార్జీలను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ప్రత్తిపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ ప్రత్తిపాడులో వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఏఈకి వినతిపత్రం అందజేశారు.

తాడికొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వకర్త వనమా బాల వజ్రబాబు డిమాండ్ చేశారు. తాడికొండ అడ్డరోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైసీపీ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు

వైసీపీ అభ్యంతరకర ఫ్లెక్సీ తొలగింపు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయం వద్ద వైసీపీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఉన్న ఫ్లెక్సీని శుక్రవారం ఉదయం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇక్కడ ఉన్న హోర్డింగ్‌పై వైసీపీ అధినేత జగన్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దానిపై ఇటీవల వచ్చిన ఓ సినిమా డైలాగ్‌ను మార్చి అభ్యంతరకర రీతిలో ఫ్లెక్సీ ఏర్పాటుచేయటంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై అధికారులు స్పందించి ఉదయమే ఫ్లెక్సీని తొలగించారు.

అయ్యప్ప స్వామికి అన్నాభిషేకం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామికి అన్నాభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు. స్థానిక ముత్తెంశెట్టి పాలెంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామివారి దేవస్థానంలో శుక్రవారం మాలధరించిన స్వాములతో కలసి దుర్గారావు గురుస్వామి అయ్యప్ప స్వామికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేసి, అన్నాభిషేకంను నిర్వహించారు. అనంతరం అయ్యప్పలకు, భవాని మాలధారులు, శివస్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పలు, భక్తులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని కోస్టల్ బ్యాంకులో శుక్రవారం కలారి హాస్పటల్స్, శంకర నేత్రాయల తెనాలి, కోస్టల్ బ్యాంకు తెనాలి బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 500 మందికి శంకర నేత్రాలయ వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, డాక్టర్ కాలారి శ్రీదేవి బీపీ, షుగర్ వంటి పరీక్షలను బ్యాంకు ఖాతాదారులకు, ప్రజలకు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలను, ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ నాగరాజు, కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, పుప్పల వరదరాజులు, కె.సాయిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, రవికుమార్, బ్యాంకు సిబ్బంది రమణబాబు, మనోహర్, కిరణ్, రాహేల, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం గురవయ్య కాలనీలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురవయ్య కాలనీలో తాపీ పనులు చేసుకుని జీవనం సాగించే చల్లంచర్ల మీరయ్య (32) కొంతకాలంగా జీర్ణాశయ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. దీనిని భరించలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం. కేసు నమోదుచేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

గణిత నమూనాలకు ప్రథమ స్థానం

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవ వేడుకల్లో భాగంగా నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు తాతా సాంబశివరావు రూపొందించిన గణిత నమూనాలకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ నెల 22వ తేదీన రాజమహేంద్రవరంలో గణిత నమూనాలను ప్రదర్శించారు.

చిరస్మరణీయుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

● ఏఎన్‌యూ ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



సంతాప సభలో ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్యకే గంగాధర రావు

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిరస్మరణీయుడని, నేటి యువతరానికి ఆయనను ఆదర్శం అని ఇన్చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు నివాళి అర్పించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతాప సభను శుక్రవారం డైక్మన్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం గంగాధరరావు మాట్లాడుతూ భారత ప్రధానిగా ఆయన అందించిన సేవలు భారత ఆర్థికరంగాన్ని కొత్త పుంతలు తొక్కించాయన్నారు. ప్రపంచంలో భారతదేశంను మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా నిలపడంలో మన్మోహన్ సింగ్ సంస్కరణలు దోహదపడ్డాయన్నారు. ఆధార్, ఆహార భద్రత, సమాచార హక్కు చట్టం, ఎల్‌పీజీ, వంటి సంస్కరణలతో భారతదేశాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టర్ ఆచార్య కే.



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రత్న షీలా మణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు మన్మోహన్‌సింగ్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే.వీరయ్య, ఎకనామిక్స్ విభాగం పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, దూర విద్యా కేంద్రం పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ విశేష కృషి చేశారని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు చెప్పారు. మారీసుపేట కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారం చేపట్టిన 2004 నుంచి ఆయన తీసుకున్న నిర్ణయాలతో దేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడిందన్నారు. ఆర్థికశాఖ మంత్రిగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా, ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దారని చెప్పారు. ఆయన మృతి దేశ ఆర్థిక రంగానికి తీరని లోటన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శీను, బుల్లియ్య, పూర్ణచంద్రరావు, కృష్ణ, ప్రభాకర్, శివన్నారాయణ, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బోగస్ పొదుపు సంఘాల నుంచి రుణాల రికవరీ చేయండి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ ఆదేశం

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో మెప్మా విభాగంలో అక్రమంగా బోగస్ గ్రూపులు సృష్టించి రుణాలు పొందిన వారికి నోటీసులు జారీచేసి నగదు రికవరీ చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా విభాగంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన బోగస్ గ్రూపుల విషయాన్ని ఆరా తీశారు. మెప్మా అధికారులు మాట్లాడుతూ పట్టణంలో 1695 పొదుపు సంఘాలు ఉన్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారులు వైసీపీ నాయకులతో కొందరు రిసోర్స్‌పర్సన్స్ కుమ్మక్కై 101 బోగస్ గ్రూపులను అనధికారికంగా ఏర్పాటుచేసి బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలినట్లు చెప్పారు. ఇప్పటికే మెప్మా విభాగంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతున్నందున వివరాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. అయితే ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తక్షణమే అనధికార గ్రూపుల సభ్యులను గుర్తించి వారికి నోటీసులు జారీచేసి నగదు రికవరీ చేపట్టాలని ఆదేశించారు. అలాగే పేదరిక నిర్మూలనలో భాగంగా కుటుంబ వికాసం సమాజ వికాసం అనే నినాదంతో పట్టణంలోని 13వేల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా అవగాహన చేపట్టాలని ఆదేశించారు. ప్రధామంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన స్వయం ఉపాధి, స్త్రీ నిధి, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధునికీకరణ, ముద్ర యోజన, ఉపాధి కల్పన, స్టాండ్ ఆఫ్ ఇండియా, మైక్రో, చిన్న పరిశ్రమల క్రెడిట్ గ్యారెంటీ నిధి వంటి పథకాలను అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సమీక్ష నిర్వహించి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణలో నిర్వాసితులుగా మారిన వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. 168 మంది బాధితులకు టీడీఆర్ బాండ్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం 42మందికి బాండ్లు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. అలాగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పురపాలక సంఘానికి ఆదాయ వనరులు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో ఆలసత్వం వహించవద్దని ఆదేశించారు. పట్టణంలో పోలీసుల సహకారంతో ట్రాఫిక్ సమస్యలు వాహనదారులు పార్కింగ్ విషయాలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, పురపాలక సంఘంలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పొన్నూరులో పర్యటించిన ఎస్పీ సతీష్ కుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవలసిన చర్యల గురించి అధికారులను ఆదేశాలు ఇచ్చారు. రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అర్బన్, రూరల్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నియామకంతో కొరతను అధిగమించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అర్బన్ రూరల్ సిఐలు, రవికిరణ్, కోటేశ్వరరావు, ఎస్సైలు గుండు కిరణ్ రాజ కుమార్, శ్రీహరి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన ఆర్‌జేసీ

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సాక్షి భావ నారాయణస్వామి, సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాలను శుక్రవారం దేవాలయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ అజాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ రికార్డుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు: ఏడీఏ ఉషారాణి

కొల్లిపర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించినట్లయితే వారిపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరులో ఆమె ఆకస్మికంగా ఎరువుల షాపును తనిఖీ నిర్వహించారు. రికార్డులను, గొడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు.

పెదకాకానిలో జీడీసీసీబీ నూతన శాఖ ప్రారంభం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం పెదకాకానిలో నూతనంగా ఏర్పాటు చేసిన జీడీసీసీ బ్యాంక్ నూతన శాఖను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సౌకర్యం కోసం పెదకాకాని మండల కేంద్రంలో ఈ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

పెదకాకానిలో టీడీపీ కార్యకర్తలు షేక్ బాజీ (72), దానబోయిన వెంకట నారాయణ (65), వుయ్యూరు నాగయ్య (94), తోటకూర సులోమి (63), వూయ్యూరు నాగలీలా కుమారి (64), కొద్దిరోజులకు క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వారి గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రెవెన్యూ సదస్సుకు 34 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నండూరులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 34 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. మ్యుటేషన్ కోసం 12 అర్జీలు, పాస్ పుస్తకాల కోసం 6, ఎఫ్ లైన్ దరఖాస్తులు 5, అడంగల్ కోసం 1, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 2, డిజిటల్ సిగ్నేచర్ కోసం 2, కుల ధ్రువీకరణ కోసం 4, ఇన్కమ్ సర్టిఫికెట్ కోసం 2 అర్జీలు దాఖలయ్యాయి. రెవెన్యూ సదస్సులో అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన చేశారు. చెంచుపేట డొంక రోడ్డు నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈఈ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన వాగ్దానాలన్నీ మరిచిపోతుందన్నారు. అందులో భాగంగానే విద్యుత్ చార్జీలను కూడా పెంచుతుందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, పార్టీ నాయకులు మాలేపాటి హరిప్రసాద్, మద్దాళి శేషాచలం, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొన్నూరులో...



పొన్నూరులో వినతిపత్రం అందచేస్తున్న వైసీపీ నాయకులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలపై విధించిన 15వేల కోట్ల సర్‌చార్జీల భారం తగ్గించాలని వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపుపై సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6వేల కోట్ల భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. మరో 9వేల కోట్ల భారం మోపేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ బాలురోన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపడంతో వారిని పూర్వ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులతో అభినందించారు. శుక్రవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల్లో జరిగిన క్రీడల్లో ఈ పాఠశాల విద్యార్థులు 33మంది ప్రతిభ చూపి 80పతకాలు సాధించారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ, విద్యార్థులను ప్రోత్సహించి వారు అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ పంపిణీ చేశారు. పేద విద్యార్థి రావూరి జయేంద్రకు రూ.6500 నగదు అందించారు. పొన్నం విజయ్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, పొట్టి నరేంద్ర, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్చకుడి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక నాజరుపేటకు చెందిన పరమాత్మ బదరీ నారాయణరావు (65) మారీసుపేటలోని ఓ దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.21లక్షలతో అభివృద్ధి పనులు

● మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెనాలి సుందరీకరణలో భాగంగా మురుగు పారుదల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి రూ.21 లక్షలతో డ్రెయిన్‌ల నిర్మాణ పనులను ప్రాంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక వెల్లడించారు. శుక్రవారం స్థానిక గంగానమ్మపేటలోని పాత శివాలయం రోడ్డులో డ్రెయిన్‌ల ఆధునికీకరణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగానమ్మపేటలో చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయన్నారు. దీనిపై అనేకమార్లు ప్రజల నుంచి మున్సిపాలిటీకి ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై మంత్రి మనోహర్ సానుకులంగా స్పందించి డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టాలని సూచించారన్నారు. త్వరతగతిన నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, టీపీవో సాంబశివరావు, ఇన్‌చార్జ్ ఏఈ జానీబాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. స్థానిక చినరావూరులోని సత్యనారాయణ మున్సిపల్ పార్కు, బుర్రిపాలెం రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను, డంపింగ్ యార్డులో నిర్మిస్తున్న వేవింగ్ మిషన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంగలకుదురులోని 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ వెంకట్రావు తెలిపారు. అంగలకుదురు, కోపల్లె గ్రామాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సామూహిక కుంకుమార్చన

తెనాలి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత ప్రయూక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వీఎస్ఆర్ కళాశాల రోడ్డు శరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో లక్ష్మీనారాయణ పూజ చేశారు. నరేంద్ర రామానుజ దాస స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.